# లేచిపోక ఏం జేస్తుంది?

"పట్టభద్రుడు"

"అమ్మా, నాకతడు ఒద్దే!"

"ఏమే నిక్షేపంలా ఉన్నాడు! నెలకు 500 రూపాయల జీతము. ముద్దుముచ్చటలు అన్నీ తీరుతాయే?"

"ఎందుకమ్మా? అతనికి మన తాతయ్య వయస్సుంటుందే! జుత్తంతా పండిపోయిందే!"

"అయితేనేమే! 100 తులాల బంగారమునగలు, 4 పెట్టెల చీరలు వెండిసామాను, అంతా నీదేనే!"

"ఎందుకే? నాకు ముసలి మొగుడొద్దే!"

"ముసలి మగడంటావేమిటే? ఇదుగో అక్కయ్యనిచ్చేము చూస్తున్నావు కదా! బి. ఏ. ప్యాసయినవాడు, 20 యేళ్లవాడు అని ఇచ్చేము చూసేవా? యెలా సుఖపడుతూందో!"

"అమ్మా; సుఖపడకేమే? చూసేవా మొన్న బావ, అక్కయ్య పండక్కి వచ్చినప్పుడు చిలుకా గోరింకల్లాగు వున్నారు. అక్కయ్య కొడుకుని చూస్తే ముద్దువస్తూవుంటాడు. బావ యెప్పుడూ అక్కయ్యతో హాస్యాలాడుతూ నవ్వుతూ మాట్లాడుతాడు."

"బాగానే వుంది! వంటిమీద వస్తువులు లేవు. నేటిసరికి ఉద్యోగంలేదు. పుస్తె పూస అమ్ముకుని కాలక్షేపం."

"అమ్మా! నాన్నతో చెప్పి యెలాగైనా యీ సంబంధం తప్పించే."

"మీ నాన్నకుకూడా ఈ సంబంధం బాగానేవుంది. ఇది తప్పదు.

* * *

"లలితా? వీధిలోకి అస్తమానము వెళ్లకే! విధవవని అస్తమానము అగపడితే తిడతారు."

"అయితే పోనియ్యవే, అలాగే మానేస్తాను."

* * *

"ఏమండీ! లలిత బంగారం, దాని మగని Provident Fund అంతా యిచ్చేసేరా?"

"ఆ వ్యవహారమంతా తెరపి అయిపోయింది. దానికి పెండ్లినాడు ఇచ్చిన నూరు తులాల బంగారం Provident Fund యిచ్చేసేరు. Bank లో వేసేను."

"చిన్నపిల్ల! దానికేం తెలుసు! ఈ బంగారం అంతా యేం జేస్తుంది?"

"పోనీ! అబ్బాయికి దాని డబ్బుపెట్టి B.A.,B.L. దాకా చదువు చెప్పిస్తే వాడే దాన్ని యావజ్జీవము దగ్గరుంచుకుంటాడు. అది తమ్ముడిదగ్గరే హాయిగావుంటుంది."

* * *

"నాకు నలుగురిలో బుఱ్ఱ యెత్తుకు తిరగడానికి సిగ్గవుతూంది. ఫలానా నరసింగరావుగారి కూతురు, తురకాడిని తీసికొని లేచిపోయిందంటున్నారు అందరూను"

"ఆడపిల్లలను కనుక్కున్నవాళ్లము అన్నిటికీ తల ఒగ్గవలసిందే. ఇంతపని చేస్తుందని యెప్పుడూ అనుకోలేదండీ"

"బంగారం అంతా పట్టుకు పోయిందే!"

"ఆఁ! బంగారము అంతా పట్టుకు పోయింది. మొన్న దానిపేర వ్రాయించిన రెండువేల రూపాయల తణఖా దస్తావేజుకూడ పట్టుకుపోయింది."

"యెంత ఘోరం చేసింది?"

"ఇప్పుడేంచేస్తారు?"

"ఇంట్లో 100 తులాల బంగారం పట్టుకు లేచిపోయినట్లు దానిమీద వాడిమీద పోలీసుకేసు పెడతాను."

"పోనీండి! బంగారమేనా దక్కితే అంతే చాలును!"

* * *

మర్నాడు నరసింగరావుగారికి రిజిస్టరీ పుత్తరం.

మహారాజశ్రీ నాన్నగారికి, మీ కుమార్తె లలిత అనేక నమస్కారములు:—నాకు మీరు పెండ్లిచేసిన మగడు గతించుటచేతను, మీయింట నున్నంతకాలము ప్రపంచ సౌఖ్యము లభించునను యాశ లేకపోవుటచేతను నా యిష్టుడైనవాని నొకనిని చేపట్టి నా యాస్తినంతయు తీసికొనిపోతిని. మీ యింటిలోనిది యొక చిల్లిగవ్వయైన నపహరింపలేదు. మీకు నిజముగ నాయం దభిమాన మున్నయెడల, నా సౌఖ్యమునే కోరువారైనయెడల నాపై గాని, నా ప్రియునిపైగాని యేవిధమైన అబద్ధపు కేసులను పెట్టవలదని వేడుచున్నాను.

ఇట్లు,

లలిత.

## ఆ, ఆ, నాకేదీ గుల్లం !!




హిట్లరు మొద్దబ్బాయి:—అందరూ గుల్లాలు (గుర్రాలు) యెక్కి స్వారిచేస్తున్నారు నాకేదీ గుల్లం ?

[ అన్ని రాజ్యములకును వలస రాజ్యములు ఉన్నవి. జర్మనీకి అటువంటి దేమీలేదు. అందువల్ల మొద్దు బుల్లెబ్బాయి హిట్లర్, వలస రాజ్యాల కోసం అవస్థపడుతున్నాడు. ]

(హిందూస్థాన్ టైమ్సు)